# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో దేశ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సర్క్యులర్ ఎకానమీపై ఈరోజు సమీక్ష చేపట్టారు.
- ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేసే పోరాటానికి ప్రపంచ దేశాలు మద్దతుగా నిలుస్తున్నాయని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ అన్నారు.
- నైరుతి బంగాళాఖాతంలోని అల్పపీడనం రాబోయే 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

==========================

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో దేశ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ మేరకు యోగా దినోత్సవ సందేశంతో కూడిన ఒక లేఖను ఈరోజు విడుదల చేశారు. ప్రధానమంత్రి ఈనెల 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోనున్నామని తెలిపారు. ఈ చారిత్రాత్మక యోగా ప్రస్థానం విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సంవత్సరం మరింత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. గత 10 సంవత్సరాలుగా యోగా కేవలం భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావాన్ని చూపడం అందరికీ గర్వకారణమన్నారు. విశాఖపట్నం కేంద్రంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఒకే భూమి... ఒకే ఆరోగ్యం కోసం యోగా అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం జరుపుకుంటున్నారు.

==========================

రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను పటిష్టపరిచేలా... రెండు నెలల్లో “సర్క్యులర్ ఎకానమీ”కి సంబంధించి తుది పాలసీని తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈరోజు సచివాలయంలో

సర్క్యులర్ ఎకానమీపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష చేపట్టారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని 3 ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులను ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నామని... మొదటిదశలో భాగంగా విశాఖపట్నంలో 400 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయిలో 'సర్క్యులర్ ఎకానమీ పార్కు'ను నిర్మించనున్నామని తెలిపారు. సర్క్యులర్ ఎకానమీ కింద కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 11 రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి తెలిపారు. అదనంగా గనులు, చేనేత, పశుసంవర్ధక శాఖలతో కార్యాచరణ సిద్ధం చేయాలని నిర్దేశించారు. వచ్చే అక్టోబర్ 2వ తేదీ నాటికి రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం నగరాలతో పాటు మరో 17 కార్పొరేషన్లలో ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

=========================

విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత  అన్నారు.  ఈనెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవ వేడుకలపై మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా బాల వీరాంజనేయస్వామి, బీసీ జనార్దన్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్‌తో కలిసి ఈరోజు విశాఖలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ... ఈ వేడుకకు 5 లక్షల మంది వచ్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. "ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

=========================

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేసే పోరాటంలో ప్రపంచ దేశాలు మద్దత్తుగా నిలుస్తున్నాయని అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాథూర్ అన్నారు.  డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆయన పాత్రికేయులతో  మాట్లాడుతూ... ఇటీవల శశిథరూర్ బృందంతో భారత్ తరపున వివిధ దేశాల్లో పర్యటించిన అంశాలను ఎంపీ వెల్లడించారు. తాము పర్యటించిన దేశాల్లో భారత్ వైఖరిని ఆయా దేశాలకు బలంగా వినిపించామని, ఏ పరిస్థితుల్లో భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టాల్సి వచ్చిందో సవివరంగా ఆయా దేశాలకు తెలిపామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడి నేతృత్వంలో భారత్ మరింత అభివృద్ధి పదంలో ముందుకు వెళుతుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

విరామం

=========================

దేశంలోని గిరిజన గ్రామాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం "ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్" పథకాన్ని తీసుకువచ్చిందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కొత్తవలస గ్రామంలో ఈరోజు నిర్వహించిన ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ అవగాహన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ఈ పథకం 2029 వరకు అమల్లో ఉంటుందని వివరించారు. ఈ పథకం క్రింద గిరిజనులు నివసించే 63,843 గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, వైద్య సేవలు, జీవనోపాధి, రహదారుల అనుసంధానం, ఆర్థిక సాధికారత వంటి ముఖ్య రంగాల్లో అభివృద్ధి చర్యలు చేపడుతున్నామని మంత్రి వివరిస్తూ..

(వాయిస్ 22 సెకన్లు)

=========================

గుంటూరు జిల్లా మంగళగిరిలో సుమారు 138 కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతన్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ అధికారులకు సూచించారు. ఈ రోజు మంగళగిరిలోని ఆటోనగర్ ఏపీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో

ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేసి వచ్చే సంవత్సరం నాటికి రోగులకు వైద్య సేవలు అందించేలా అధికారులు కృషి చేయాలన్నారు.

==========================

రేణిగుంట విమానాశ్రయానికి శ్రీవేంకటేశ్వర అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరు పెట్టాలని విమానాయన శాఖకు ప్రతిపాదన పంపనున్నామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. టీటీడీ  పాలకమండలి సమావేశం వివరాలను తిరుమలలో ఈరోజు సమావేశ పాత్రికేయులకు వెల్లడించారు. బెంగుళూరులో శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయం నిర్మించాలని కర్నాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డి.కే. శివకుమార్ ను కోరామని, స్థలం కేటాయించగానే ఆలయం నిర్మించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. టీటీడీకి 100 విద్యుత్ బస్సులు అందజేస్తానని కేంద్రమంత్రి కుమారస్వామి హామీ ఇచ్చారని ఛైర్మన్ తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల వల్ల తిరుమలలో భక్తులకు ఉచిత రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. టీటీడీ విద్యాసంస్థల్లో విద్యార్థులకు సనాతన ధర్మం, తెలుగు సాంస్కృతిక వైభవంపై శిక్షణ ఇవ్వడానికి “మన వారసత్వం” పేరుతో కార్యక్రమం చేపడుతున్నామని బీఆర్ నాయుడు వెల్లడించారు.

==========================

తెనాలి నుండి మంగళగిరి వరకు 4 వరుసల రహదారి కోసం 800 కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ అభివృద్ధి పనులు వర్షాకాలం ప్రారంభం ముందుగానే చేపట్టామని వెల్లడించారు. తెనాలి నుండి నారాకోడూరు అలాగే తెనాలి నుండి మంగళగిరి వరకు చేపట్టిన రహదారి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీటిని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. గుంతలు పూడ్చడం, మరమ్మతులు చేయటంతో పాటు పునః నిర్మాణ పనులకు ప్రభుత్వం 1,200 కోట్ల రూపాయలు కేటాయించిందని నాదెండ్ల మనోహర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

==========================

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా మందలపల్లిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో నిర్మించబోయే డార్మెటరీ భవనానికి ఆమె ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బాలబాలికలకు నాణ్యమైన విద్యను అందించడంలో విద్యా శాఖ ఎంతో కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల కోసం వసతి గృహాలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారని తెలిపారు.

==========================

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోందని, దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి  7.6 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ... రాబోయే 24 గంటల్లో పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలలో మరింత బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాగల 24 గంటలలో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

==========================
==========================